# ఓ బావి కథ

ప్రతాప రవిశంకర్

ఎంకడు—రాముడు మంచి స్నేహితులే కాదు.. దగ్గిర బంధువులు కూడా..ఏ పని కైనా ఇద్దరూ కలిసే వెళతారు.

కోళందరెడ్డి నెలరోజుల క్రితం ఆ ఇల్లును కొన్నాడు.. ఆ ఇంటికి అన్ని సౌకర్యాలూ వున్నాయిగానీ బావి లేదు, వచ్చేది ఎండాకాలం. అందుకే రెడ్డి బావి తవ్వించాలనుకున్నాడు.

**అ**ప్పుడే ఎండ ముదురుతోంది.

ఉండీ వుండీ వెచ్చనిగాలి నెట్టుకువివస్తోంది. సూర్యనమస్కారాలు చేస్తున్నట్టున్నాయి వొంగిపోయిన చెట్లు.

మధ్యాహ్నం

మామిడిచెట్టు నీడన నిలబడిన రాముడు మళ్ళీ ఎండలోకి రాకతప్పలేదు.

పైన నిలబడి కిందికి తొంగిచూశాడు వాడు. లోపల పలుగుతో తవ్వుతున్నాడు ఎంకడు.... ఒంగివున్న ఎంకడు వీపుమీది చెమట బిందువులు ఎండలో మెరుస్తున్నాయి. తవ్విన మట్టినంతటినీ తట్టలోకి యెత్తి "లాక్కో" అన్నాడు పెద్దగా.... తాడుతో తట్టను పైకిలాగి మట్టి బయటవంచి మళ్ళీ తట్టను లోపలకు దించాడు రాముడు.

అప్పటికే మట్టిలో తేమ మొదలయింది.

"ఇంకా ఎంతమట్టి తియ్యాలా....తడి మట్టి తగుల్తోంది" అన్నాడు రాముడు.

"ఇంకెంత....మూడడుగులు...." పలుగును భూమిలోకి దించాడు ఎంకడు....

"కానీ....ఇయాల్టికి ఈపనయితే రేపటికి ఇంకోపని చూస్కోవొచ్చు"చేతిలో వెలుగుతున్న చుట్టను దూరంగా విసిరాడు.

ఎంకడు మాట్లాడలేదు. పనిలో మునిగిపోయాడు....

ఐదు నిముషాలు గడిచిన తర్వాత కోళందరెడ్డి అక్కడికి వచ్చాడు.

లోపలకి తొంగి చూసి "జలపడిందా?" అని అడిగాడు....

"పడుతోంది దొరా.... తడిమట్టి తగుల్తోంది.... ఇంక ఒక అడుగు మట్టిదీస్తే జల దూకుద్ది" ఎంకడు బావిలోంచి చెప్పాడు పని చెయ్యటం ఆపి.

"కానియ్యండి. తియ్యటి జల పడాలి. మామిడిచెట్టు పక్కన బావిలో నీళ్ల మామిడి రసంలా వుండాలి" అన్నాడు సిగరెట్టు ముట్టించి.

"తప్పకుండా దొరా ఈ లోగిల్లో ఉప్పు జల పడదు. బంగార మంటినేల" రాముడు అన్నాడు.

"అన్నాలు తిన్నారా?" అడిగాడు కోళందరెడ్డి.

"లేదు దొరా తినాల".

"సాయంత్రానికి నీళ్ళు నా కళ్ళపడాలి" అని వెళ్ళిపోయాడు రెడ్డి. తల వూపాడు రాముడు.

కోళందరెడ్డి వెళ్ళిపోయిన తర్వాత ఎంకడు బావిలోనించి పైకి వచ్చాడు.

మామిడి చెట్టుకింద ఇద్దరూ భోజనాల కూర్చున్నారు. చల్లగా వుంది చెట్టుకింద.

"ఈ యేడునీళ్ళకు మంచి కరువొస్తది. అప్పుడే చెర్లో నీళ్ళు యెండిపోతున్నాయి" రాముడు అన్నాడు.

"అవును.... మనమేం జెయ్యాలో.... మన కర్మ.... మన పల్లెలో ఎంత లోతు తవ్వినా చుక్క నీళ్ళు రావటల్లేదు. కాలువలు కూడా కట్టేశారు. ఎట్టాబతుకుతామో."


ఎంకడు అన్నాడు బావిపక్కన ఎత్తుగా వున్న మట్టిని చూస్తూ. "ఈ బావిలో మంచి జలే పడుద్ది. రెడ్డి దొరను అడుగుదాం. కాదనడు. ఆయన వొప్పుకుంటే మనకు తాగటానికి నీళ్ళబాధ వుండదు" రాముడు అన్నాడు.

"దొరను ఇప్పుడే అడగొద్దు. తర్వాత అడుగుదాం".

తల వూపాడు రాముడు.

భోజనాలయినాయి..

మళ్లీ బావి తవ్వడంలో మునిగిపోయారు ఇద్దరూ..



ఆ వూళ్ళో బావి తవ్వే మనుషులు ఆ ఇద్దరే. అందుకే రెడ్డి రాముడికి కబురు పెట్టాడు. బావితవ్వాలని చెప్పాడు. ఒప్పుకున్నాడు రాముడు.

తను ఎంతకూలి ఇచ్చేదీ ముందుగానే చెప్పాడు కోళందరెడ్డి. కోళందరెడ్డి మంచి ధనవంతుడు. నాలుగేళ్ళ క్రితం ఆ వూరికి వచ్చాడు. పొలాలుకొన్నాడు. వ్యవసాయంలో మంచి లాభం పొందాడు. ఇప్పుడు ఇల్లు కూడా కొన్నాడు.

కోళందరెడ్డి ధనవంతుడే గానీ పరమ లోభి. అందుకే రాముడికీ, ఎంకడికీ బావి తవ్వినందుకు కూలి అందరికంటే తక్కువ ఇస్తానని అన్నాడు. ఐనా ఒప్పుకున్నారు ఆ ఇద్దరూ. కోళందరెడ్డి మాటను కాదని ఆ వూళ్ళో తాము చెయ్యగలిగింది ఏమీ లేదు.

ఎండ పలుచబడుతోంది.

ఎంకడు సంతోషంతో అరిచాడు.

"జల దూకుతోందిరా రాములూ."

తొంగిచూశాడు రాముడు.

నీళ్ళు జరజరా వస్తున్నాయి.

దోసిలితో నీళ్ళుపట్టి నోట్లో పోసుకున్నాడు ఎంకడు.

తియ్యగా వున్నాయి నీళ్ళు.

"కొబ్బెర నీళ్ళల్లే వున్నాయి రా రాముడూ" మళ్ళీ అరిచాడు.

రాముడు లోపలకు పరిగెత్తాడు.

భార్యా పిల్లలతో కలిసి బత్తాయి పండ్ల రసంతాగుతున్నాడు కోళందరెడ్డి.

"దొరా జలపడింది. కొబ్బెరనీళ్లు" సంతోషంతో చెప్పాడు రాముడు.

"వదండి....చూద్దాం...."లేచి నిలబడ్డాడు రెడ్డి.

భార్యా పిల్లలతో బావి దగ్గరకు వచ్చాడు. లోపలకు చూశారంతా. నీళ్ళు జరజరా వస్తున్నాయి చప్పుడుచేస్తూ.

"నీళ్ళు....నీళ్ళు" ఆనందంతో చప్పట్లు కొట్టింది కోళందరెడ్డి చిన్నకూతురు.

"ఈ ఎండాకాలం మనకు నీటికరువు లేదు" మీసాలు దువ్వుకుంటూ అన్నాడు కోళందరెడ్డి భార్యతో.

"అవును దొరా" అన్నాడు రాముడు.

* * *

ఎండ మండుతోంది.

ఊళ్ళో చాలా బావులూ, చెరువులూ ఎండిపోయాయి. అక్కడా అక్కడా చెట్లు కూడా ఎండిపోయాయి.

పిట్టలన్నీ వలసపోయినట్టున్నాయి. అంతటా నిశ్శబ్దంగా వుంది.

ఆ రోజు ఎంకడికీ, రాముడికీ ఎక్కడ తిరిగినా కడివెడు నీళ్ళు దొరకలేదు దాహంతో ఇద్దరికీ పెదవులు ఎండిపోయాయి. ఇంట్లో భార్యాపిల్లలు నీళ్ళులేక దిక్కుతోచక కూలబడిపోయారు.

"రెడ్డిదొర కాడికి ఎల్దాం" అన్నాడు రాముడు.

"పద" అన్నాడు ఎంకడు.

ఇద్దరూ కోళందరెడ్డి ఇంటికి వచ్చారు.

వాళ్ళు వచ్చేసరికి రెడ్డి భార్య, ఇద్దరు పెద్ద కూతుళ్లతో పేకాట ఆడుతున్నాడు.


చేతిలో మట్టికుండలతో వచ్చిన ఆ ఇద్దరినీ చూశాడు రెడ్డి.

"దొరా" పిలిచాడు రాముడు.

తలెత్తిచూసి "ఏరా ఏమిటి ఇలా వచ్చారు?" అడిగాడు మళ్లీ పేకముక్కలు చూసుకుంటూ.

"నీళ్ల దొరా" అన్నాడు ఎంకడు..

"నీళ్ళా?"




"అవును దొరా" వూరంతా తిరిగినా ఒక్క బొట్టు కూడా దొరకలేదు. ఇంటికాడ ఆడోళ్లు, పిల్లలు నోళ్లు ఎండి చచ్చేట్టున్నారు దొరా" చెప్పాడు రాముడు.

"అయితే ఏమంటారు?" సిగరెట్టు పొగ వదులుతూ అడిగాడు కోళందరెడ్డి..

"తమరి బావిలో ఈ కడివెడు నీళ్ళు ఇప్పించండి దొరా."

"కడివెడు నీళ్ళా!" పెద్దగా నవ్వాడు రెడ్డి.... నవ్వి మళ్ళీ అన్నాడు. "మీకు బావి తవ్వినందుకు ఇచ్చిన కూలిడబ్బునంతా ఇచ్చినా ఇప్పుడు మీకు కడివెడు నీళ్ళు రావు. పొండి. చుక్కనీళ్ళు కూడా ఇవ్వను."

"దొరా" దెబ్బతిన్నట్టు అరిచారు ఇద్దరూ.

"అవున్రా....ఎండ చూడు....అసలే బావిలో నీళ్ళు తక్కువగా వున్నాయి. సాయంత్రం చెట్లకు నీళ్ళు సరిపోతాయో, లేదో అని ఆలోచిస్తున్నాను-వెళ్ళండి."

"దొరా...మా ప్రాణాలుకాపాడండి దొరా. కడివెడు నీళ్ళు ఇప్పించండి" మీ పుణ్యముంటుంది. దాహంతో చచ్చిపోతున్నాం" ప్రాధేయపడ్డారు ఇద్దరూ.

"వెళ్ళండిరా.... ఇంకెక్కడయినా అడుక్కోండి. లేకపోతే ఎక్కడయినా బావి తవ్వుకుని పొట్టపట్టినన్ని నీళ్ళు తాగండి."

పెద్దగా నవ్వాడు కోళందరెడ్డి. అతనితో పాటు ఆయన మనుషులందరూ నవ్వారు.

"దొరా........ మీ కాళ్ళు పట్టుకుంటాను" ముందుకు వెళ్ళి రెడ్డి కాళ్ళ మీద పడ్డాడు ఎంకడు.

"వదులు....వదులు. కాళ్ళు ముట్టుకోకు వెధవా. వెళ్ళు. మీరు అరచి చచ్చినా బొట్టు నీళ్ళు కూడా ఇవ్వను".

"దోసెడు నీళ్ళిచ్చి బతికించండి దొరా. నాలిక ఎండిపోతోంది. చచ్చిపోతున్నాం" రాముడు దీనంగా అన్నాడు.

"మర్యాదగా వెళ్ళండి. లేకపోతే బయటకు గెంటుతాను" కోపంతో అరిచాడు కోళందరెడ్డి.

ఎంకడు — రాముడు ఖాళీ కడవలతో వెనక్కుమళ్ళారు.

"వెధవలు.... నీళ్ళివ్వాలిట" నవ్వాడు రెడ్డి.

* * *

తెల్లవారింది.

బావి దగ్గరకు నీళ్ళకోసం వచ్చిన కోళందరెడ్డి భార్య లోపలకు తొంగిచూసి పెద్ద కేకపెట్టింది.

ఆ కేకతో రెడ్డి, పిల్లలు పరిగెత్తుకుంటూ వచ్చి బావిలోకి చూశారు.

బావిలో నీళ్ళు కనిపించలేదు. చెత్త,

ఆకులు కనిపించాయి ఎత్తుగా.

వాటిమీద చచ్చిపోయిన కుక్క, పిల్లి కనిపించాయి. భరించలేని వాసన పైకి వస్తోంది.

కోళందరెడ్డికి కళ్లు తిరిగాయి.

మామిడి రసంలాంటి నీళ్లు....ఏవి?

బావి మొత్తం-పూడిపోయింది.

రెడ్డి కళ్లముందు ఎంకడు—రాముడు కదిలారు.

పళ్ళు పటపటలాడించాడు.

నీళ్ళివ్వలేదనే కోపం కొద్దీ బావిని పూడ్చారు వెధవలు. వీళ్ళ అంతు చూడాలి.

అప్పటికప్పుడే ఎంకడ్ని, రాముడ్ని తీసుకురమ్మని తన మనుషులను పంపించాడు.

పావుగంట తర్వాత వెళ్ళిన మనుషులు వచ్చి కోళందరెడ్డితో ఇలా చెప్పారు.

"ఎంకడు— రాముడు ఆడోళ్ళతో, పిల్లలతో వూరొదిలి వెళ్ళిపోయారు."

## గోమాత సాక్షిగా

గాలి సుడిగాలిగా, జనం ప్రభంజనంగా మారుతున్న వేళ
అక్షర తాండవం ఎవరైనా చూశారా
గుండె లోలోతులలో అక్షర సంగీతం ఎవరైనా విన్నారా
నేను విన్నాను
రావిశాస్త్రి కథలలో నేను చూశాను
గోమాత సాక్షిగా
మరిడీ మహాలక్ష్మి నెన్నానటి నెత్తురుబొట్టు సాక్షిగా
ఒకే ఒక మాట చెబుతున్నాను
అశ్రుగంగా జలాలలో అగ్నిసుందరిని సృష్టించిన ఒకే ఒక
కథకుడు అతడే అతడే
అతడు నడుస్తున్నంతమేరా కదంతొక్కుతున్న శబ్దహయహేష
ధీర గభీర జీవన కథా సరిత్సాగర ఘోష.

— 'అజంతా'


# అభినందనలు

1982 మే నెలలో మా వద్ద ఇంజనీరింగ్ ఎంట్రన్స్ కోచింగ్ తీసికొన్న వారిలో దాదాపు 240 సీట్లు వచ్చినట్లు విద్యార్థులు వ్రాసిన ఉత్తరముల ద్వారా తెలిసినది.

వారందరికి మా అభినందనలు. ఇంకా కొంతమందికి సీట్లు వచ్చాయని వారి స్నేహితుల ద్వారా తెలిసినది. వారు వెంటనే వారి రిజిష్టరు నెంబరుతో సహా తెలియజేయగోర్తాము.

ఇట్లు

L. రత్తయ్య, డైరెక్టర్,

విజ్ఞాన్ ట్యుటోరియల్స్, బ్రాడీపేట, గుంటూరు-2.